# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ నదుల అనుసంధానంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ శ్రీకాకుళంలో కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి కె. అచ్చెన్నాయుడు కోరారు.
- ❖ సింహాచలంలో రేపు జరగనున్న గిరి ప్రదక్షిణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- ❖ వాణిజ్య అనుకూల నగరంగా విశాఖను అభివృద్ధి చేస్తామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.
- ❖ అల్పపీడన ప్రభావంతో రేపు రాష్ట్రంలో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==============================

నదులు అనుసంధానంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నంధ్యాల జిల్లా శ్రీశైలంలో ముఖ్యమంత్రి ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీశైలం ప్రాజెక్టు వద్ద రైతులతో కలిసి జలాశయం గేట్లను ఎత్తి నాగార్జున సాగర్ కు నీటిని విడుదల చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... వంశధార, పోలవరం, బనకచర్ల అనుసంధానం కావాలని కోరారు. నీటిని సమర్థవంతంగా వాడుకోవాల్సి ఉందని చెప్పారు. సముద్రంలో కలిసే నీటిని ఉభయ తెలుగు రాష్ట్రాలు వాడుకుంటే రైతులకు మేలు జరుగుతుందని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

==============================

రాష్ట్రంలో వ్యవసాయరంగ సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన ఈ రోజు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. వెనుకబడిన జిల్లాల కోసం మైక్రో ఇరిగేషన్ పథకానికి రాయితీ పెంపుపై కూడా విజ్ఞప్తి చేశారు. గుంటూరులో మిర్చి బోర్డ్, శ్రీకాకుళంలో జీడి పప్పు బోర్డ్, చిత్తూరులో మామిడి బోర్డ్ ను ఏర్పాటు చేయాలని కోరారు. విభజన చట్టం ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

==============================

విశాఖ జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రం సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వారి గిరి ప్రదక్షిణ రేపు జరగనుంది. ఈ సందర్భంగా తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ రోజు సింహాచలంలో పర్యటించిన మంత్రి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.... గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నెంబర్లు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామని హోం మంత్రి పేర్కొన్నారు.

అదేవిధంగా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

==============================

వాణిజ్య అనుకూల నగరంగా విశాఖపట్టణాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. అమరావతిలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో ANSR సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు కుదిరిన ఒప్పందం ప్రకారం ANSR సంస్థ మధురవాడ IT క్లస్టర్‌లో అత్యాధునిక గ్లోబల్ కెపబులిటీ సెంటర్స్ GCC ఇన్నోవేషన్ క్యాంపస్ ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టనుంది. ఈ క్యాంపస్ ద్వారా రాబోయే ఐదు సంవత్సరాల్లో 10 వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పించనుంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందులో ఐటి, జిసిసి రంగాల్లోనే 5 లక్షల ఉద్యోగాలు కల్పించబోతున్నామని మంత్రి వెల్లడించారు.

విరామం

==============================

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్ల సంఖ్యను బాగా తగ్గించాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ప్రాధమిక అర్రోగ్య శాఖ డైరెక్టర్ కార్యాలయంలో నాలుగు రోజుల సమగ్ర శిక్షణా కార్యక్రమాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు సమన్వయంతో పని చేయడం ద్వారా వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. అదే విధంగా, వైద్య అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించడం ద్వారా సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని చేరుకునే దిశగా అంకిత భావంతో పని చేయాలని సూచించారు.

==============================

నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా గంధ మహోత్సవాన్ని ఈరోజు నిర్వహించారు. రొట్టెల పండుగలో ప్రధాన ఘట్టమైన గంధమహోత్సవాన్ని తిలకించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు

వేలాదిగా తరలివచ్చారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. కాగా స్వర్ణాల చెరువులో వివిధ కోర్కెలు తీరాలని కోరుతూ రొట్టెలను భక్తులు పట్టుకున్నారు. రొట్టెల పండుగ సందర్భంగా స్వర్ణాల చెరువు భక్తులతో కిటకిటలాడింది.

==============================

మచిలీపట్నం హెడ్ పోస్ట్ ఆఫీస్ లో అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ 2.0 లో పైలెట్ ప్రాజెక్టును ఇన్‌ఛార్జ్ పోస్టల్ సూపరింటెండెంట్ సురేష్ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ 2.0 ని తీసుకుని రావడం ద్వారా వేగవంతమైన పారదర్శక సేవలను అందించడం జరుగుతుందన్నారు.

==============================

రాష్ట్రంలో ఉన్న ఇరవై శాతం అతి పేద కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయడమే P4 పథకం ప్రధాన ఉద్దేశ్యమని పట్టణాభివృద్ధిశాఖ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మెప్మా ప్రధాన కార్యాలయంలో ఈరోజు జరిగిన మెప్మా 15వ కార్యనిర్వహణ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... P4 పథకం విజయవంతం చేయడంలో మెప్మా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

==============================

రాష్ట్రంలోని వివిధ సంక్షేమ వసతి గృహాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఈ రోజు ఆయా శాఖల అధికారులతో అమరావతిలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖల వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రక్రియ, భోజన వసతి తదితర అంశాలపై ఆయన సమీక్ష చేపట్టారు. ఈ సమావేశంలో ఎస్సి, బిసి సంక్షేమ శాఖల కార్యదర్శులు యం.యం.నాయక్, ఎస్.సత్యనారాయణ, ఆయా శాఖల కమీషనర్లు, డైరెక్టర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

==============================

నాణ్యతలేని, కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలను తీసుకుంటామని విజయనగరం జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ హెచ్చరించారు. జిల్లాలో నాణ్యతలోపించిన ఆహారాన్ని విక్రయించిన 12 మందికి మొత్తం 3 లక్షలు రూపాయల అపరాధ రుసుమును విధిస్తూ.. జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

==============================

పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామపంచాయతీలో మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పొలంలో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధా లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

==============================

అల్పపీడన ప్రభావంతో రేపు రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి తెలియచేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==============================
==============================